# శిలాసదృశం

## కౌలెపు శివశేఖర్

కొన్ని సమస్యలు చాలా అందంగా ఉంటాయి-అన్నాడు ఓ మిత్రుడు.

నిజమేనేమో అనుకున్నాను.

సమస్యల్ని సమోసాల్లా తినేసి జీర్ణం చేసేసుకోవాలి-అన్నాడు మరోసారి అదే మిత్రుడు.

తినడానికి నాకు సమస్య లేదే అని విచారించేశాను.

కొన్ని రోజులు పోయాక నిజంగా ఓ భయంకరమైన సమస్యను తినేసిన నా మిత్రుడు అరక్క.. ఆనందపడిపోయి ఆత్మహత్య చేసేసుకున్నాడు.

నేనుమాత్రం రెండుకంటే ఎక్కువ కన్నీటి బొట్లు కార్చలేకపోయాను.

ప్రస్తుత కథకు ఈ ఉపోద్ఘాతం అనవసరం అయినా, నా హృదయంలో కదలికల్ని దాచుకోలేక పోయాను.

నాకూ ఈ మధ్యే ఓ సమస్య ఎదురైంది. నా మిత్రుడు చెప్పినట్లు అది అందంగా లేదు. కాన్సర్ వ్యాధిలా కళ్ళముందు నిలిచిపోయి తెగ భయపెట్టేస్తోంది.

ఏంచేయాలో దిక్కుతోచక వెన్నెల్లో డాబా మీద పడుకొని చుక్కల్ని లెక్కబెడుతున్నాను.

అర్ధరాత్రి గడిచిపోయింది.

చల్లగా గాలి వీస్తోంది. ఆ గాల్లో ఎగిరొచ్చిన దోమలు నా మీద విహరిస్తున్నాయి. నిద్దుర రావడంలేదు-దోమలవల్ల కాదు; నాకు ఎదురైన సమస్యలవల్ల.

ఈ వెన్నెల రాత్రి నీలిమ నా పక్కన ఉంటే ఎంత బావుణ్ణో- ఆమె ఎదపై గడిపేయాలనిపిస్తోంది.

ఊహలు కూడా అందంగానే ఉంటాయి. కానీ, వాస్తవంలో నీలిమ ఈ డాబా ఎక్కి నా పక్కకు వస్తుందా-? వచ్చినా, ఎదపై తల వాల్చుకో నిస్తుందా?

ఎందుకో బిగ్గరగా నవ్వాలనిపించింది.

అలా నవ్వితే, నీలిమే కాదు...ఆమె తల్లి తండ్రులు, తమ్ముళ్ళు, చెల్లాయిలు, ఆఖరికి ఆమె అక్క కామేశ్వరికూడా డాబా మీదకు వచ్చేసే ప్రమాదం ఉంది.

కామేశ్వర్ని చూస్తే ఎందుకో జాలి...ఒకోసారి భయంకూడా కలుగుతుంది.

కామేశ్వరే కదా ఈ సమస్యని నా మీదకు విసిరేసింది. కామేశ్వరే లేకపోతే నీలిమను తనదాన్ని చేసేసుకొనేవాడే! ఇందులో కామేశ్వరి తప్పేం ఉంది?లేదు.

పాపం కామేశ్వరి! అలా అనుకొని ఎందుకో నిట్టూర్చాను.

ఆకాశంలో చంద్రుడు వెన్నెల్ని తెగ కురిపించేస్తున్నాడు. నక్షత్రాలు పాలిపోయిన మొహాలతో భూమ్మీదకు చూస్తున్నాయ్. ఒక్కసారి బద్దకంగా ఆవులించాను. ఆ వెనువెంటనే నాలుగైదు దోమలు నోట్లోకి పోయాయ్. ఆ దోమలకు మృత్యువు నా నోరు కాబోలు అనుకొని కొద్ది సేపు విచారించేను. ఆనక మరోసారి ఆవులించబోయి అతి ప్రయత్నంమీద ఆపుకున్నాను.

పాపం కామేశ్వరి! మళ్ళీ అనుకున్నాను.

వయసులో ఉన్న ప్రతీ ఆడపిల్లా అందంగా ఉంటుంది...ఎక్కడో చదివాను.

కామేశ్వర్ని చూశాక అది తప్పనుకున్నాను.

కామేశ్వరి వయసు రావడమే కాదు; పెళ్ళి చేసుకొనే వయసుకూడా దాటిపోయేలా ఉంది.

అయినా, ఆమెలో అందం ఎక్కడిది?

చిన్న కళ్ళు, బండ పెదవులు, వంకర ముక్కు, ఎత్తు పళ్ళు, నలుపు ఛాయ. శరీరంలో వంపుసొంపులు కనిపించవు. మొహంలో ఏమాత్రం యవ్వనం గోచరించదు.

ఆమెని మొదటిసారిగా చూసినప్పుడు అసహ్యమే కల్గింది. చూడగా చూడగా జాలి పెరిగింది.

మధ్య తరగతి కుటుంబం. కట్నం ఎక్కువ ఇచ్చుకోలేని ఆ కుటుంబం ఆమెకు వరుడ్ని కొనలేక పోయింది. కొనడానికి ఎన్నో సార్లు ప్రయత్నించినా, వచ్చిన వరుళ్ళకు ఆమె నచ్చక తిరిగి చూడకుండా పారిపోయారు. గుండెలమీద కుంపటిలా, పిచ్చి మొక్కలా నిలిచిపోయిన కామేశ్వరిని ఎలా వదిలించుకోవాలో తెలీక పిచ్చెక్కిపోయి ఉన్నారు కామేశ్వరి తల్లిదండ్రులు.

అందుకే 'పాపం కామేశ్వరి' అని అనుకోకుండా ఉండలేకపోయాను.

కామేశ్వరికి ఇక పెళ్ళికాదా? ఎన్నివిధాల యోచించినా, కాదనే అనుమానం నాలో బలపడ్తోంది. ఇరవై అయిదేళ్ళు మీద పడ్తున్న కామేశ్వరికే పెళ్ళికాకపోతే ఇక నీలిమకు ఎప్పుడు పెళ్ళవుతుంది?

ఎక్కడో దూరంగా గడియారం ఒంటిగంట కొట్టింది. వీధిలో ఊరకుక్క ఉబుసుపోక మొరిగింది.

ఇక ఈ రాత్రికి నాకు నిద్ర పట్టలేదు.

లేచి కూర్చున్నాను. సిగరెట్ తీసి వెలిగించాను. దోమలు నా చెవుల వద్దకు చేరి సంగీతాన్ని ప్రాక్టీసు చేస్తున్నాయ్.

నా మెదడులో ఆలోచన్లు గీపెట్టి గోల పెడ్తున్నాయ్.

ఈ డాబాలో నా ఒంటరి జీవితం ఆరంభమై ఏడాది గడిచిపోయింది.

ఉద్యోగ నిమిత్తమై ఈ ఊరు చేరిన నాకు అద్దె కొంపకోసం ఆర్రోజులు తిరగ్గా, చివరికి ఈ డాబాలో చిన్న గది దొరికింది. నా బాధలు ఏకధాటిగా ఏకరువు పెట్టి, కొద్ది సేపు భోరున ఏడ్చాక ఇంటిగల వాళ్ళ గుండె కరిగి గది అద్దె కిచ్చారు.

చివరగా ఉన్న పోర్షన్‌లో కామేశ్వరి వాళ్ళుంటున్నారు.

ఆ కుటుంబంతో మొదట్లో నా కంతగా పరిచయం లేదు. కామేశ్వర్ని అసహ్యించుకున్న నేను-నీలిమను చూడగానే ఆ ఇంటిల్లిపాదితో పరిచయం పెంచుకోవా లనిపించింది.


మెల్లగా గోవిందయ్యగారితో మాటలు కలిపాను. క్రమంగా ఆ ఇంటి మనుమలతో స్నేహాన్ని సంపాదించుకో గలిగాను. ఆ ఇంట్లోకి నా రాకపోకలు ప్రారంభమయ్యాయ్.

ఆ ఇంట్లో ఎవరు మాట్లాడినా చాలా హాయిగా ఉండేది. నీలిమ మాట్లాడితే నా ఆనందానికి హద్దు లుండేవి కాదు. కానీ, కామేశ్వరి మాట్లాడితే నా ఆనందానికి ఎవరో అడ్డుగోడలు కట్టేసినట్లు ఫీలయ్యే వాడ్ని.

కామేశ్వరి అందవిహీనంగా ఉండటం, నీలిమ ఎంతో అందంగా ఉండటం...ఒకే కడుపున పుట్టిన వాళ్ళిద్దర్లో ఎందుకంత తేడానో బోధపడేది కాదు.

నీలిమతో నా పరిచయం ముందుకు సాగడానికి కారణం-ఆమె రోజూ ఉదయం టైప్ ఇన్‌స్టిట్యూట్‌కి వెళ్ళడమే.

నేనూ అదే సమయంలో ఆఫీసుకి బయల్దేరడం, ఇద్దరం దార్లో కబుర్లాడుకోవడం- మహ సరదాగా ఉండేది.




ఇలా చాలా రోజులు గడిచిపోయాక ఓ రోజున గుండె నిండా ధైర్యం తెచ్చేసుకుని అన్నాను: "మన కబుర్లలో వెరైటీ లేకుండా పోతోంది, నీలిమా?"

ఆమెకేం అర్థం కాలేదు.

"పనికిమాలిన కబుర్లు చెప్పుకొని కాలాన్ని కరిగించేస్తున్నామేమో నని అనుకుంటున్నాను."

"వివరంగా చెప్పండి."

"కబుర్లలో అనేక రకా లున్నాయి. అవన్నీ చెప్పడానికి టైం చాలదు. మనం రేపట్నుంచి ప్రేమ కబుర్లు చెప్పుకుంటే బాగుంటుందని నా అభిప్రాయం."

"అవి నాకు చేతకావు."

"నాకు వచ్చు. వినడానికి మీకేం అభ్యంతరం లేదుగా!"

"అవి ఇప్పుడే చెప్పడానికి మీ కేమిటి అభ్యంతరం?"

"చెప్పొచ్చనుకో..."

"చెప్పండి."

"నే నో అమ్మాయిని ప్రేమిస్తున్నాను."

"ప్రేమంటే?"

"నిజంగా తెలీదా నీకు?"

"ఇంతవరకూ అనుభవం లేదు."


"పోనీ రేపట్నుంచి నన్ను ప్రేమించు."

"అదే...ఎలా?"

ఎలా చెప్పాలో అర్థంకాక బుర్ర గోక్కున్నాను. ఆమె ఫక్కున నవ్వే సింది. అది భరించ లేక నుదురు కొట్టుకున్నాను. ఆపై మానంభాషణ సాగలేదు.

ఆ రాత్రి డాబామీద వంటరిగా పడుకున్న నాకు నిద్ర పట్టలేదు. ఏవో అడుగుల చప్పుడు కావడంతో ఉలిక్కిపడి చూశాను. నా పక్కగా నీలిమ. ఆశ్చర్యపోయాను. ఈ అర్థరాత్రి డాబామీదకు ఎందుకొచ్చినట్లు? ఉదయం నే నన్న మాటలకు బుద్ధి చెప్పడానికి వచ్చిందా? లేక చెంపలు పగులగొట్టడానికి వచ్చిందా? ఆ ఊహ రాగానే గభాల్న లేచి కూర్చున్నాను.

నా ఎదురుగా ఆమె పాదాలు కనబడుతున్నాయ్. వాటిని పట్టేసుకొని క్షమించమని అడిగేయా లనుకున్నాను.




నేనీ ఆలోచనలో ఉండగా, ఆమె నా ఎదురుగా కూర్చుంది.

చెమటలు పట్టేస్తున్నాయ్ నాకు.

"రేపట్నుంచి మిమ్మల్ని నేను ప్రేమించదల్చుకోలేదు." మెల్లిగా మాట్లాడినా, ఆమె కంఠం కోపంగానే పలికింది.

ఎందుకో భయమేసింది-ఆమె పాదాలు అర్జంటుగా పట్టేసుకోవడం ఉత్తమం అనుకున్నాను. కానీ, చీర కుచ్చిళ్ళు కింద ఆమె పాదాలు దాక్కొనున్నాయి. పోనీ కుచ్చిళ్ళను తొలగిస్తే...అమ్మో! చెంపలే కాదు; తల కూడా వగుల గొట్టేస్తుంది.

"ఉదయం నుంచి ఆలోచిస్తున్నాను..."

ఏవనీ! నన్ను ఎలా అల్లరి పెట్టాలనా?

"ఏమిటి మాట్లాడరు...?"

"మ...మ...మ...త...ధ ..ద...ధ...న..."

"ఏమైంది మీకు?"

"జ్వరం...ఇప్పుడే ప్రారంభమైంది."

"సరే! నే/చెప్పున్నా వినండి- నేను ఇప్పట్నుంచే మిమ్మల్ని ప్రేమిస్తున్నాను."

అంతే! గభాల్న కావలించేసుకున్నాను.

"అయ్యో! ఏమిటి అలా దిండును కౌగిలించుకున్నారు?"

చటుక్కున దిండును వదిలేసి, మెల్లిగా అన్నాను: "నిన్ను కౌగలించుకుంటే తిడతావని భయంవేసి..."

ఆమె చిన్నగా నవ్వింది.

ముత్యాలు ఒలికినాయేమోనని పక్కంతా తడుముకున్నాను.

"ఇది చెప్పడానికే వచ్చాను. ఇక వెళ్తా" అనేసి .ఆమె డాబా దిగిపోయింది.

నిద్ర కరువై, గుండె బరువై డాబా దిగిపోయిన నా చెలికోసం పిట్ట గోడ మీద కూర్చుని రాత్రంతా జాగరణ చేశాను.

ఆ తెల్లారి మా ప్రేమ ఈ ఊరి తోటల్లో పరుగులు తీసింది. పార్కుల్లో పడి గెంతులేసింది. అనువైన ప్రదేశాల్లో ప్రవహించేసింది. మా ఇద్దరి గుండెల్లో ప్రేమ నిండుగా నిండిపోయింది. మనసు మూలల్లో పాతుకుపోయింది.

చివరికి ప్రేమలో బోరు కొట్టేసి పెళ్ళి చేసేసుకుందాం అనుకున్నాం. అలా నిర్ణయించుకున్నాకే, అసలు సమస్య ఎదురైంది.

కామేశ్వరి పెళ్ళిగాకుండా, నీలిమకు పెళ్ళి చేయరే! కామేశ్వరికి పెళ్ళయే సూచన్లు కనుచూపు మేరల్లో కానరావడం లేదు. కనుక ఏం చేయాలి?

తీవ్రంగా ఇద్దరం బుర్రలు బద్దలు కొట్టేసుకున్నాం. కంబైండ్‌గా విచారించేశాం!

గాలి బహు చల్లగా వీస్తోంది. చంద్రుడు తెల్లగా వెలిగి పోతున్నాడు. దోమలు సకుటుంబంగా జుం మంటూ నా కళ్ళముందు నాట్యం చేస్తున్నాయ్. మరో సిగరెట్ వెలిగించాను.

మరికొన్ని రోజులు గడిచిపోయాక, ఓ సాయంత్రం నీలిమను అడిగాను- "మనం పెళ్ళెప్పుడు చేసుకుందాం."

"మా అక్కయ్య పెళ్ళయ్యాక!"

"అది ఇప్పట్లో కాదు."

"అంతవరకూ నిరీక్షిద్దాం."

"ఆమెకోసం నీ సుఖాన్నెందుకు కాల్దన్నుకుంటావ్?"

"మరేం చేయను?"

"నాతో వచ్చేయ్."

"ఎక్కడికి?"

"ఎక్కడికన్నా వెళ్ళిపోదాం."

"అంటే, లేచిపోవడమా!"

"ఇంతకుమించి మరో మార్గం లేదు."

ఆమె చాలా సేపు మాట్లాడలేదు. నేనూ మౌనంగా ఉండిపోయాను. కొద్ది సేపు తరవాత, "నీ ఇష్టం" అంది.

ఈ సంభాషణ పెరట్లో బావి దగ్గర జరిగింది. అదే మేం చేసిన పొరపాటు. ఆ రాత్రి యథాప్రకారం డాబామీద పడుకున్నాను.

నీలిమ నాతో రాబోతోంది అనే ఆనందంతో ఉక్కిరి బిక్కిరై పోతున్నాను. ఏవేవో ఆలోచన్లతో మెదడంతా నిండిపోతోంది.

ఎంత రాత్రి గడిచిందో తెలీదు.

హఠాత్‌గా ఎవరిదో నీడ నా మీద పడినట్లయింది.

అదిరిపడి లేచాను.

నా ఎదురుగా కామేశ్వరి!

ఎందుకో చిన్నగా వణికిపోయాను. బహుశా ఆమె అందవిహీనం నాలో ఆ భయాన్ని తెచ్చి పెట్టిందేమో!

"మీతో మాట్లాడాలి" అం దామె.

అయోమయంగా ఆమె వేపు చూస్తుండి పోయాను.

ఈ అర్ధరాత్రి ఆమె నాతో మాట్లాడవలసిన ముఖ్య విషయం ఏం ఉంటుంది?

"నీలిమను మీరు పెళ్ళిచేసుకుంటారా?"

ఉలిక్కిపడ్డాను ఆ ప్రశ్నకు.

"సమాధానం చెప్పండి."

"నీలిమ మీతో చెప్పిందా?"

"లేదు...పెరట్లో మీరు మాట్లాడుకున్న మాటలన్నీ విన్నాను."

సర్వం ఆమెకు తెలిసిపోయిన తరవాత ఇక దాయవలసిందేముంది? "అవును...చేసుకుంటాను."

"అంతా మీ ఇష్టమేనా?" తీక్షణంగా అంది.

"మరొకరి ఇష్టాలతో ప్రమేయం లేదు మాకు."

"నా పెళ్ళి గురించి ఏం ఆలోచించారు?"

"మీ...మీ...పె...ళ్ళా...!" ఆశ్చర్యపోయాను. ఆమె పెళ్ళిగురించి మేం ఎందుకు ఆలోచించాలి? ఇదేదో చాలా వింతగా ఉందే!

"అవును! మీ ఇద్దరూ పెళ్ళిచేసుకోవాలనే నిర్ణయాని కొచ్చినప్పుడు, నా పెళ్ళి గురించి కూడా ఆలోచించవలసిన బాధ్యత మీ ఇద్దరిమీదా ఉంది."

"ఎలా?" బుర్ర గోక్కుంటూ అడిగాను.

"నీలిమ మీతో లేచి వచ్చేస్తుంది. ఆ తరవాత ఈ సమాజం మిమ్మల్ని దూషించి, అవమానించి, వెలివేసినట్లు చూస్తుంది. మా కుటుంబం పరువు పోతుంది. ఆపై నన్ను పెళ్ళిచేసుకోవడానికి ముందుకు వచ్చే మగాడు ఎవడు? నా అనాకారితనంతో ఇంతకాలం నాకు పెళ్ళిగాకుండా ఉంది. మీరు చేయబోతున్న అప్రాచ్యపు పనితో నా జీవితమే సర్వనాశన మవుతుంది. ఇక జీవితంలో నాకు పెళ్ళిగాదు. అందుకే అడుగుతున్నా-ముందు నాకు పెళ్ళి చేయండి; లేదా, నా పెళ్ళయేంతవరకైనా మీ పెళ్ళి వాయిదా వేసుకోండి."

అయిదు నిమిషాలవరకూ మాట్లాడలేకపోయాను. వరుడ్ని వెతకడం పెద్ద కష్టం కాకపోయినా, ఆమెను పెళ్ళిచేసుకొనే విశాల హృదయులు నా స్నేహితులలో ఎవ్వరూ

లేరు. అయినా, ఇదేం గొడవ? చిరాగ్గా ఆమెవైపు చూశాను.

"మాట్లాడరేం?" అంది.

"మీ పెళ్ళి గురించి ఆలోచించవలసింది, బాధ్యత వహించవలసింది మేం కాదు, కామేశ్వరిగారూ!" ఎందుకైనా మంచిదని చాలా గౌరవంగా మాట్లాడాను.

"ఇంతేనా మీరు చెప్పేది!" చిన్నగా ఆమె కంఠం వణికింది.

"ఇంతకు మించి నేనేం చెప్పలేను."

అంతే! హఠాత్తుగా ఆమె కూలబడిపోయి, మోకాళ్ళ మధ్య తల ఉంచుకొని వెక్కివెక్కి ఏడవసాగింది.

కంగారు పడిపోయాను.

అర్థరాత్రి మద్దెల దరువు లాగా ఈ ఏడుపు రాగా లేమిటి? అయినా, ఆమెను ఎలా వోదార్చాలి? ఏంచేయాలో తెలీక నేనూ కూలబడిపోయి, ఆపై ఏం తోచక నుదురు కొట్టుకున్నాను.

పదినిమిషాల తరవాత ఏడుపు ఆపి తలెత్తి చూసిందామె.

నా గుండె విపరీతమైన జాలితో తీవ్రంగా కొట్టుకో సాగింది.

"ప్లీజ్! ఆలోచించండి-దయచేసి నా జీవితాన్ని నాశనం చేయకండి. నీలిమ మీతో వచ్చేసిన మరు నిమిషం నేను ఆత్మహత్య చేసుకుంటాను" అనేసి, చాలా వేగంగా ఆమె మేడమెట్లు దిగిపోయింది.

నా బుర్ర మొద్దుబారిపోయింది.

మాపెళ్ళి కారణంగా ఓ ఆడదాని జీవితం నాశన మవుతుందని నే ఇంతకాలం ఊహించలేకపోయాను.

కామేశ్వరి నా కళ్ళు తెరిపించింది.

కామేశ్వరి పెళ్ళయ్యాకే నీలిమతో నా పెళ్ళి జరుగుతుంది అనే నిర్ణయానికి అర్జంటుగా వచ్చేశాను. నా ఆలోచనలో ఏ మాత్రం తొందరపాటు లేదనుకున్నాను. ఇదేదో గొప్ప ఆశయం, ఆదర్శం- అనుకొని ఉన్నతంగా ఫీలైపోయాను.

ఇంతకీ కామేశ్వరికి పెళ్ళెప్పు డవుతుందో? చేసుకోబోయే వరుడెవరో గాని, వాడు తెల్లవారే సరికి తాళిబొట్టుతో సహా కామేశ్వరి ఇంటి గుమ్మంలో నిలబడితే బావుణ్ణు!

రకరకాలుగా ఆలోచించేస్తున్నాను. సిగరెట్లు కాల్చేస్తున్నాను.


"బాబూ..." అనే అస్పష్టమైన పిలుపు.

నా ఆలోచన్లు తెగి చావడం లేదు.

"బాబూ..." ఈ సారి దగ్గరగా.

ఆ దిశను చూసి, అదిరిపడ్డాను. గోవిందయ్యగారు- ఎప్పుడొచ్చారో మరి-ఆ మూలగా పిట్టగోడను ఆనుకొని నిలబడి ఉన్నారు.

ఈ సమయంలో ఆయనగారు ఎందుకు డాబా మీదకు వచ్చినట్లో? వచ్చినవాడు ఆ మూలగా ఎందుకు నక్కి నిలిచినట్లు? ఏమా కథ అనుకుంటూ ఆయన చెంతకు చేరుకున్నాను.




"ఇంతకుముందే కామేశ్వరి నీతో మాట్లాడి వెళ్ళింది కదూ?"

నా కాళ్ళలోంచి సన్నగా వణుకు ప్రారంభమయింది.

"కామేశ్వరి కన్నీళ్ళకు కరిగిపోయావా?"

నేను మాట్లాడలేదు.

"ఆమె చెప్పిన విషయాలు విని నీ జీవితాన్ని నాశనం చేసుకోకు."

"అంటే..." అయోమయంగా అన్నాను.

"కామేశ్వరికి పెళ్ళి చేయాలని నే నెన్నిసార్లు పాట్లు పడ్డానో నీకు తెలీదు. ఇక దానికీ జన్మకు పెళ్ళి కాదు. దానికి పెళ్ళి కాకపోతే, నీలిమకు కూడా పెళ్ళి కాదేమోననే బెంగతో కుమిలి పోతున్నాను. కానీ, నీవు ఆమెను పెళ్ళిచేసుకోవా లనుకుం టున్నావని తెలిసి చాలా ఆనందపడుతున్నాను."

గోవిందయ్యగారు అలా మాట్లాడటం నాకు ఆశ్చర్యంగానే ఉంది.

"నీలిమను నీవు లేవదీసుకు పోవాలనుకుంటున్నావు కదూ!"

భయంగానే తలాడించాను.

"ఇక వెన కడుగు వేయకు. నీ ఆలోచన్ని ఆచరణలో పెట్టడం మంచిది."

"మరి కామేశ్వరి..."

"ఆమె విషయం మర్చిపోయినప్పుడే నీ వనుకున్నది సాధించగలవ్" అని ఆయన మెట్లవేపు కదలబోయాడు.

"కాని, ఒక్క మాటండీ!"

"ఏమిటది?"

"కన్న కూతురు లేచిపోవడం...!"

ఆయన ఓ నిమిషంపాటూ మాట్లాడలేదు. అనంతరం-"ఇష్టమో, అయిష్టమో నే తేల్చి చెప్పలేను కానీ, నా పరిస్థితుల్లో ఇంతకంటే ఏం చెప్పగలను? కామేశ్వరి జీవితం ఎలానూ మోడుబారి పోవలసిందే. నీలిమ జీవితం అలా కాకూడదనే నా ఆలోచన." మరోమాట మాట్లాడకుండా గోవిందయ్యగారు డాబా దిగిపోయారు.

బుర్రంతా వేడెక్కిపోయింది. ఎటూ ఆలోచించలేక పోతున్నాను.

గోవిందయ్యగారి మాట ప్రకారం నీలిమను తీసుకుపోతే, ఖచ్చితంగా కామేశ్వరి ఆత్మహత్య చేసుకుంటుంది. మొదటి కూతురికి పెళ్ళి చేయలేక పోయాననే అసమర్థత, రెండో కూతురికి పెళ్ళి కాదేమోననే భయం గోవిందయ్యగారి మాటల్లో అంతర్యం స్పష్టంగా అగుపడ్తోంది. ఏదో విధంగా నీలిమకు కావాలనేదే ఆయన ఆలోచన. ఇందులో ఆయన స్వార్థం ఎంతైనా ఉంది.

ఏమైనా కామేశ్వరి జీవితంలో వసంతం రావాలి. ఆమె ఆత్మహత్య చేసుకోకూడదు.

×× ×× ××

ఎక్కడో కోడి కూసింది.

గతంలోంచి తేరుకొని చూశాను.

తెల్లవారడానికి ఎంతో సమయం లేదు. కళ్ళు మండుతున్నాయ్. నిద్ర వచ్చే సూచనలు లేవు. డాబా దిగి వచ్చేశాను.

కొన్నిరోజులు గడిచిపోయాయ్. మధ్య మధ్యలో నీలిమ నన్ను అడుగుతూనే ఉంది- 'మనం ఎప్పుడు లేచిపోదాం' అని.

నేను సమధానం చెప్పలేక పోతున్నాను.

గోవిందయ్యగారు అప్పుడప్పుడూ నావేపు కోపంగా చూస్తున్నారు. ఆయన చూపుల్లో అర్థం-నీలిమను ఇంకా ఎందుకు లేవదీసుకు పోలేదని?

కామేశ్వరి మాత్రం నా వేపు తరచూ దీనంగా నే చూస్తూ ఉంది.

ఆమె చూపులకు నే కరిగిపోతున్నాను.

కొన్ని నెలలు గడిచిపోయాయ్.

ఇప్పుడు నీలిమ నాతో సరిగా మాట్లాడటం లేదు. నే నెక్కడ కనిపిస్తానోనని తప్పించుకు తిరుగుతోంది.

ఆనాటి ప్రేమ కబుర్లు, చిలిపి తగవులు మా మధ్య కరువై పోయాయి.

కామేశ్వరికి ఇంకా పెళ్ళి కావడం లేదు.

గోవిందయ్యగారు నాతో పూర్తిగా మాట్లాడ్డం మానేశాడు.

ఎందుకో వీళ్ళంతా ఒక్కొక్కరే దూరమై పోతున్నారు.

ఓ ఉదయం నాకు తెల్సిన వార్తతో క్రుంగి పోయాను.

నిద్ర మంచంమీంచి గభాల్న లేచి, గోవిందయ్యగారి ఇంటికి పరుగుతీశాను.

ఆ ఇంటిల్లపాదీ విషాదంలో మునిగి పోయారు.

అందుకు కారణం-

కామేశ్వరి ఆత్మహత్య చేసుకోలేదు.

నీలిమ ఎవడితోనో లేచిపోయిందట!

గోవిందయ్యగారికళ్ళలో ఏవో మెరుపుల్ని చూడగలిగాను.

ఏళ్ళు గడిచిపోతున్నాయి.

ఇప్పటికీ కామేశ్వరికి పెళ్ళి కాలేదు. ■